క్లుప్తంగా

నేత్రపర్వంగా గజవాహనసేవ



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా తీర్థవాది, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, గజవాహనసేవను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సతీష్, లత దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం గేట్ వద్ద గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో రోడ్డుపై ఈ నెల పదిన పడిపోయారు. స్థానికుల సమాచారంతో సదరు వ్యక్తిని 108లో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00018, 94403 33191 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం చేసిందేమీలేదు



మాట్లాడుతున్న చలపతిరావు

కోవూరు: ప్రజల నెత్తిన అప్పుల భారం మోపడం మినహా కూటమి ప్రభుత్వం చేసిందేమీలేదని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు ధ్వజమెత్తారు. నెల్లూరులోని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ మోసపూరిత హామీలతో టీడీపీ గెలుపొందిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలవుతున్నా, హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికే రూ.1.46 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని చెప్పారు. దోచుకోవడం.. దాచుకోవడానికే కూటమి ప్రభుత్వం పరిమితమైందని విమర్శించారు. రాష్ట్రంలో ఎవరైనా బాగుపడ్డారంటే అది చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణేనన్నారు. ఏపీ ఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ కోవూరు మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మండల కన్వీనర్లు మావులూరు శ్రీనివాసులురెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, చిమటా శేషగిరి, నేత బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘జీవీకే’ విద్యార్థులకు అభినందన



కార్తీక

ఇందుకూరుపేట: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షల్లో జీవీకే చిన్మయ విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని కరస్పాండెంట్ బద్దిపూడి హరిత, ప్రిన్సిపల్ బసివిరెడ్డి తెలిపారు. విద్యార్థులను బుధవారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. కార్తీక 478, పూర్వి 461, రోషిణి, వెంకటసంయుక్త 456 మార్కులను సాధించారని పేర్కొన్నారు.

చెన్నకేశవస్వామికి అశ్వవాహనసేవ



ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అశ్వవాహనసేవను నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. 17వ డివిజన్లోని చిల్డ్రన్స్ పార్కు, అపోలో హాస్పిటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నగరంలో రోడ్డు ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టామని తెలిపారు. కాలువలు, ఫుట్‌పాత్ ఆక్రమణలను గుర్తించి, తొలగిస్తున్నామని తెలిపారు. చిల్డ్రన్స్ పార్కులో వసతులు, టికెట్ కౌంటర్ నిర్వహణ తదితరాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలో రోడ్డు మార్గానికి అడ్డుగా వేసిన భవన నిర్మాణ సామగ్రిని గమనించిన కమిషనర్, సంబంధిత యజమానికి నోటీసులను జారీ చేయడంతో పాటు జరిమానా విధించాలని ఆదేశించారు. భవన నిర్మాణ కొలతలు, ఇంటి పన్నుకు మధ్య వ్యత్యాసం ఉండటం.. ఖాళీ స్థల పన్నులను వసూలు చేయకపోవడంతో సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలన్నారు. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు సమీపంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం, తాగునీటి పంప్ హౌస్ పనితీరును పరిశీలించారు. ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని 54 డివిజన్లలో కష్టపడి పనిచేసే పారిశుధ్య కార్మికులను గుర్తించి డివిజన్‌కు ఒకరికి చొప్పున నగదు ప్రోత్సాహకాలను ప్రతి నెలా మూడో శనివారాన నిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందజేయాలని కమిషనర్ నందన్ సూచించారు. నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బీట్ ది హీట్ అంశంలో భాగంగా నగరంలోని వీలైన అన్ని ప్రాంతాల్లో మొక్కలను నాటనున్నామని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, డీఈ రహంతుజానీ, ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారద జయంతి



నెల్లూరు(బృందావనం): ఏసీనగర్‌లోని స్వామి వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్లో దేవర్షి నారద జయంతిని సాహితీ సుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు జర్నలిస్టులను సత్కరించారు. ముఖ్యవక్తగా సహ ప్రాంత ప్రచార ప్రముఖ్ వాసుదేవరావు హాజరయ్యారు. తొలుత నారద మహర్షి చిత్రపటం వద్ద జ్యోతి ప్రకాశం చేశారు. జిల్లా సంఘచాలక్ బయ్యా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్‌కు నూతనంగా నియమితులైన డైరెక్టర్లను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నేతలు బుధవారం సత్కరించారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్, ఆపరేషన్ డైరెక్టర్ గురవయ్యను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు ఎస్సెమ్ బాషా, అల్తాఫ్ సన్మానించారు. అసోసియేషన్ నేతలు నవాజ్‌జానీ, రియాజ్, దిల్దార్, జక్రియా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వెయ్యి మంది క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. స్కిన్, హెయిర్ స్పెషలిస్ట్ హర్షవర్ధన్, అడ్వొకేట్ రామచంద్రరాజు సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. సీఏ సాంబశివరావు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, స్నేహ సురేష్, రఘురామ్ ముదిరాజ్, రంగారావు, అనంతరామారావు, నలుబోలు బలరామయ్యనాయుడు, రమణయ్య, శేగు రమేష్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార చట్టాలకు అనుగుణంగా పనిచేయాలి



మహిళా సంఘ సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార చట్టాలకు అనుగుణంగా జిల్లాలోని సహకార సంఘాలు విధులు నిర్వర్తించాలని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. కందుకూరు డివిజన్ చిన్నఓగూరు సంఘబంధం, గ్రామ సమాఖ్య సహకార సంఘ మహిళా సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అనంతరం మ్యాక్స్ పొదుపు సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు తదితరాలను అందజేశారు. కావలి డివిజనల్ సహకారశాఖాధికారి తిరుపాల్‌రెడ్డి, నెల్లూరు డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి పది నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.25,37,051 మేర సమర్పించారని చెప్పారు. యూఎస్ డాలర్, సౌదీ రియాళ్లను సమర్పించారని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి వివరించారు. దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, పూడిపర్తి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్‌నాయుడు, ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మునికృష్ణ సోదరుడి కుమార్తె వివాహ వేడుకను రంగనాయకులపేటలోని రాఘవ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వధూవరులను పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆశీర్వదించారు.

రెజ్లింగ్ జట్ల ఎంపిక నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రెజ్లింగ్ అండర్ – 17, 23 బాలబాలికల జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఎంపిక చేయనున్నామని రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌కుమార్, నాగేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. వివరాలకు 94416 44761 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

18న ఓపెన్ చెస్ టోర్నీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫన్‌పార్క్ – ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను గొలగమూడిలోని ఫన్ పార్క్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఆనంద్‌వింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫన్ పార్క్ ఎండీ సాయి సౌజన్యంతో పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. విజేతలకు ప్రోత్సాహకంగా రూ.లక్ష నగదు, జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అందజేయనున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 200 మందికిపైగా క్రీడాకారులతో పాటు ఫిడే రేటింగ్ గల వారు హాజరుకానున్నారని తెలిపారు. పేర్ల నమోదుకు 97030 49378 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నీటి పొదుపుపై చిత్రలేఖన పోటీలు

కొడవలూరు: వేసవి శిక్షణ శిబిరాన్ని పురస్కరించుకొని నీటి పొదుపుపై కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను బుధవారం నిర్వహించారు. తెలుగు కఠిన పదాలపై డిక్టేషన్ పెట్టారు. లైబ్రేరియన్ రాజేశ్వరి మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయొద్దని కోరారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ముగిసిన సాంస్కృతిక పోటీలు



నెల్లూరు(అర్బన్): ఆరోగ్య వ్యవస్థకు నర్సులు వెన్నెముక లాంటి వారని మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ యశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలోని నర్సింగ్ సిబ్బందికి రెండు రోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు జరిపారు. సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. హాస్పిటల్ హెడ్ ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నర్సింగ్ హెడ్ శైలజ, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి అరుదైన ఆపరేషన్



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో తమ ఆస్పత్రికి వచ్చిన చిన్నారికి అరుదైన కీ హోల్ ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడామని అపోలో సూపర్ స్పెషాల్టీ ఆస్పతి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్‌సతీష్, న్యూరో సర్జన్ వెంకట్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. గూడూరుకు చెందిన ఐదేళ్ల బాలిక తలకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయని, దీంతో ఇక్కడి ఎమర్జెన్సీ విభాగానికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారని చెప్పారు. చిన్నారిని ఐసీయూలో ఉంచి మరుసటి రోజున సీటీ స్కాన్ చేయగా, మెదడులో కుడివైపు భాగంలో రక్తం గడ్డ కట్టడాన్ని గుర్తించామని తెలిపారు. కుటుంబసభ్యుల అంగీకారంతో మినిమల్లీ ఇమేజ్ అప్రోచ్ విధానంలో కీ హోల్ పద్ధతిలో ఎండోస్కోపీ, మైక్రోస్కోపీని ఉపయోగించి సర్జరీ చేసి గడ్డకట్టిన రక్తాన్ని తొలగించామని వివరించారు. చిన్నారి ప్రస్తుతం కోలుకుందన్నారు. డాక్టర్లను హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజు అభినందించారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



నెల్లూరు(బారకాసు): రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలను విధించాలని ఎంహెచ్‌ఓ చైతన్య ఆదేశించారు. నగరంలోని 38వ డివిజన్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు, మేస్త్రీలతో కలిసి బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. బ్లాక్ స్పాట్లను గ్రీన్ స్పాట్లుగా మార్చాలని సూచించారు. రోడ్లను డైనా క్లీన్ స్వీప్ మెషీన్‌తో శుభ్రపర్చాలని పేర్కొన్నారు.

కాలువల్లో పూడికతీత



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 29వ డివిజన్లో గల కాలువల్లో పూడికతీత పనులను బుధవారం చేపట్టారు. వీఎమ్మార్‌నగర్ పెద్ద కాలువ, మనుమసిద్ధినగర్‌లోని కాలువల్లో రోబో మెషీన్‌తో చేపట్టిన పనులను కార్పొరేటర్ సత్తార్ పరిశీలించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జాకీర్‌హుస్సేన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి సహకరించరూ..



వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): కార్మికుల కోసం పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈ నెల 19న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సహకారాన్ని అందించాలని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్రకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు సందానీబాషా, కమ్మటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈలో ‘రెయిన్‌బో’ ప్రతిభ



నెల్లూరు సిటీ: సీబీఎస్‌ఈ పది, 12వ తరగతి పరీక్షల్లో రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని స్కూల్ డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కలివెలపాళెంలోని పాఠశాలలో విద్యార్థులను బుధవారం అభినందించిన అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. 12వ తరగతిలో తన్వి 468, హరిబాబు 467, బిలాల్ 466, దర్శన 462, శాన్వీరెడ్డి 455 మార్కులను సాధించారని వివరించారు. పదో తరగతిలో శ్రేయ కుషాహ్వ 491, జంపాని షారోన్ సారుప్య 488, తనూష కెంచె 487, నయన్ మౌర్య, మొహమ్మద్ యూనస్ 484 మార్కులను సాధించారని వివరించారు.

‘అవెన్యూస్’ ప్రభంజనం



నెల్లూరు (టౌన్): సీబీఎస్‌ఈ ఫలితాల్లో అవెన్యూస్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ కృష్ణచైతన్య పేర్కొన్నారు. దర్గామిట్టలోని పాఠశాలలో విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. లక్ష్మీ విజ్వల్ 485, పెంచలసాయి పవన్ 480, రిహాన్ 476 మార్కులను సాధించారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు శ్వేత సంధ్య, వైస్ ప్రిన్సిపల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇస్కాన్ సిటీ ఐదో వీధిలో విద్యుత్ వైర్లు ప్రమాదభరితంగా మారాయి. కిందికి వేలాడుతుండటంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. తాజాగా జేసీబీ తగలడంతో వైర్లు గురువారం తెగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమస్యను అధికారులకు పలుమార్లు తెలియజేసినా ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వృద్ధాశ్రమానికి కుర్చీల వితరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నారాయణరెడ్డిపేటలోని బాపూజీ వృద్ధాశ్రమానికి కుర్చీలను బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ షో యువర్ లవ్ అగాపే టీమ్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. రెవరెండ్ మణిరావు, మల్లెల కృపారాజన్, పెంచలయ్య, మేరీ సరళ, షీలా, మేరీ బ్లెస్సింగ్టన్, వృద్ధాశ్రమ నిర్వాహకుడు రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం నేడు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. రూ.41 కోట్లతో ఈ పనులను చేపట్టామని వివరించారు.

నిత్యావసర సరుకుల వితరణ

నెల్లూరు సిటీ: అయ్యప్పగుడి సమీపంలోని ప్రగతి చారిటీస్‌కు నిత్యావసర సరుకులను సింహపురి సోషల్ సర్వీస్ సభ్యులు బుధవారం అందజేశారు. బియ్యం బస్తా, కిరాణా వస్తువులు, తినుబండారాలను పంపిణీ చేశారు. సింహపురి సోషల్ సర్వీస్ ఫౌండర్ నయీమ్‌తుల్లా, వైస్ ప్రెసిడెంట్ జుబేర్, సభ్యులు సాహిల్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

17 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొదలకూరు రోడ్డు విస్తరణ పనుల దృష్ట్యా, స్తంభాలను మార్చనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో గురువారం నుంచి శనివారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేన్సర్ హాస్పిటల్, జెడ్పీకాలనీ, సారాయంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమినగర్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆ రోజుల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.